అధ్వానంగా వంతెన నిర్వహణ

- దిండి-చించినాడ బ్రిడ్జిపై ప్రయాణం నరకం
- వర్షం వస్తే చెరువును తలపిస్తున్న ఫ్లైఓవర్
- లక్షల విలువైన దీపాలు దొంగల పాలు
- పట్టించుకోని అధికారులు



దిండి-చించినాడ వంతెనపై నిలిచిన వర్షం నీరు, వెలగని సోలార్ లైట్లు



దిండి వంతెనపై ప్రమాదకరంగా గోతులు

మలికిపురం: ఉభయగోదావరి జిల్లాల మధ్య దిండి-చించినాడ వంతెన నిర్వహణ అత్యంత అధ్వానంగా మారింది. ఈ వంతెన జాతీయ రహదారుల శాఖ పరిధిలో ఉంది. ఆ శాఖ అధికారులు ఈ వంతెన నిర్వహణను గాలికి వదిలేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా వర్షాకాలం వచ్చిందంటే భారీ వర్షాలకు వంతెనపై నీరు ఇలా నిలిచిపోయి ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. వంతెనపై నుంచి మురుగు నీరు పోయే హోల్స్ పూడుకుపోవడంతో నీరు వెళ్లే మార్గం లేక ఇలా నిలిచిపోతోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే భవిష్యత్‌లో వంతెన నాణ్యత దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి వెడల్పు పనులు జరగడంతో పాటు, రైల్వే వంతెనల నిర్మాణం పనుల కారణంగా వంతెనపై భారీ వాహనాల తాకిడి అధికంగా ఉంది. రైల్వే వంతెన పిల్లర్ల పనుల కోసం కాంక్రీటు ట్రాన్స్‌పోర్టు వాహనాల రాకపోకలు నిత్యం జరుగుతుంది. ఇక జాతీయ రహదారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు కూడా అధికంగా ఉంటోంది. దీనికి తోడు వేసవిలో ఉభయగోదావరి జిల్లాల మధ్య మట్టి రవాణా అధికంగా ఉంటోంది. మట్టి వంతెనపై పడడం వల్ల వంతెనపై హోల్స్ మూసుకుపోయి వర్షం నీరు కిందికి దిగడు. దీంతో అసలే గోతులు ఉన్న వంతెనపై వర్షం నీరు నిలిచిపోయి తరచూ ఇబ్బంది అవుతుంది. అలాగే వంతెనపై ఏర్పాటు చేసిన సోలార్ లైట్ల వైభోగం కూడా మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. వంతెన నిర్మాణం అనంతరం సుమారు పదేళ్ల తరువాత విద్యుత్ లైట్లు వేశారు. ఎందరో ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగా ఎట్టకేలకు దిండి-చించినాడ వంతెనపై ఈ సోలార్ విద్యుత్ వెలుగులు వచ్చాయి. అయితే ఏర్పాటు చేసిన ఏడాది లోపే అవి అంతర్ధానం అయ్యాయి. సుమారు 15 ఏళ్ల క్రితం ఓఎన్జీసీ సహకారంతో నెడ్‌క్యాప్ ద్వారా సోలార్ లైట్లు వేశారు. అప్పట్లో సుమారు రూ.21 లక్షలు వ్యయం అయింది. వంతెన నిర్మించి సుమారు పదేళ్లు పూర్తయినా చాన్నాళ్లకు వెలుగులు రావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే లైట్లు వెలిగిన నాలుగు నెలల నుంచి దొంగల బెడద అధికమై బ్యాటరీలు చోరీలకు గురయ్యాయి. దీంతో ఈ వంతెనపై ప్రయాణికులకు కష్టాలు షరా మామూలే. లైట్లు వెలగకపోవడంతో చీకట్లు అలముకుని ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వశిష్ట గోదావరి నదిపై సుమారు రెండు కిలోమీటర్ల పొడవున్న ఈ వంతెనపై రాత్రి వేళలో ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటోంది. చీకటి పడితే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా ఈ వంతెన మారడంతో ఇక్కడి ప్రజానీకం వంతెనపై విద్యుదీకరణ చేయాలని అధికారులను, ప్రజా ప్రతినిధులకు అనేక ఏళ్ల పాటు కోరగా గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా (గెయిల్) కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ సర్వీస్ (సీఆర్‌సీ) నుంచి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. తొలుత జాతీయ రహదారుల శాఖ అనుమతి లేకపోవడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. నిర్వహణ ఇబ్బంది అవుతుందని జాతీయ రహదారులపై విద్యుత్ లైట్ల ఏర్పాటుకు అనుమతించేది లేదని ఆ శాఖ అధికారులు చెప్పగా అప్పట్లో జిల్లా కలెక్టర్ అనుమతి ఇవ్వడంతో నెడ్‌క్యాప్ అధికారులు పనులు పూర్తి చేశారు. అయితే ఈ లైట్లపై దొంగల కన్ను పడింది. లైట్లు, వీటికి కరెంట్ అందించే విలువైన బ్యాటరీలు క్రమేణా చోరీకి గురయ్యాయి. అలంకార ప్రాయంగా స్తంభాలు మాత్రమే మిగిలాయి. వంతెనపై ప్రయాణికులకు పాత రోజులు షరా మామూలే. లైట్లు వేసిన అధికారులు నిర్వహణ పట్టించుకోకపోవడంతో ఈ సమస్య ఏర్పడింది. చోరీకి గురైన స్థానంలో కొత్తగా లైట్లు వేసి సంసరక్షణ చర్యలు తీసు కోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే వంతెనపై పడిన భారీ గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

హైవే అధికారుల నిర్లక్ష్యం



వంతెన నిర్వహణలో హైవే అధికారుల నిర్లక్ష్యం చాలా ఉంది. ఆ శాఖ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. విశాఖ-చెన్నైల మధ్య రవాణాలో ఈ వంతెన కీలకంగా మారింది. వంతెన నిర్వహణ తక్షణమే మెరుగ్గా మారకపోతే ఆందోళన చేస్తాం.

– దేవ రాజేంద్రప్రసాద్, సీపీఐ నాయకుడు, దిండి.

ప్రమాదకరంగా ఉంది



జాతీయ రహదారి కావడంతో ఉభయగోదావరి జిల్లాల మధ్య నిత్యం అనేక భారీ వాహనాల రాకపోకలు సాగిస్తాయి. వంతెనపై గోతులు పడి, వర్షాల వల్ల ఆ గోతులు నీటితో మునిగి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– నల్లి గంగన్న, రైతు, దిండి.

50 ఏళ్లు నిండిన కళాకారులకు పింఛన్ ఇవ్వాలి



ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్యనారాయణ

మామిడికుదురు: 50 ఏళ్లు నిండిన కళాకారులకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలని కోరుతూ కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు వినతిపత్రం ఇచ్చింది. మలికిపురంలో సంఘం వ్యవస్థాపకుడు మంగం సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యేను కలసి వినతిపత్రం సమర్పించారు. రంగస్థలం వృత్తి కళాకారులు తమ స్థితిగతులను ఎమ్మెల్యేకు వివరించారు. కళాకారులకు ఇచ్చే పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని కోరారు. మండల స్థాయిలో కళాభవన్‌లను నిర్మించాలని, గుర్తింపు కార్డులు అందించేలా చొరవ చూపాలని, ఇళ్ల స్థలాలను అందించాలని, హెల్త్ కార్డులు మంజూరు చేయించాలని, తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఎమ్మెల్యే వరప్రసాద్‌కు ఇచ్చారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో సంఘం ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, కేశనపల్లి సర్పంచ్ యెనుముల నాగు, అడబాల ఆదినారాయణ, కుడుపూడి అర్జునరావు, సరిదే లక్ష్మి, కోటిపల్లి శ్రీదేవి, కాలం నిర్మల, కోటిపల్లి, లక్ష్మి, మద్దుల సుశీల, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి తైక్వాండోలో క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

అంబాజీపేట: రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి రజతం, ఆరు కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారని కోనసీమ జిల్లా తైక్వాండో కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో మంగళవారం అభినందించారు. త్రిమూర్తులు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు తాడిపత్రిలో న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు జరిగాయన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో ఎ.పవన్‌తేజ రజత పతకాన్ని, జి.జెస్సీలేఖన, ఎం.మౌనిక, జి.లాహితి తేజ, కె.శాలిని శ్రీలు కాంస్య పతకాలు గెలిచారన్నారు. క్యాడెట్ విభాగంలో పి.లక్ష్మీచరణ్య, కేకే సాయిదుర్గ కాంస్య పతకాలు గెలిచారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఎస్సై కె.చిరంజీవి, ఎంఈఓ 1,2లు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, పీఈటీ అందె సూర్యకుమారి, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారన్నారు.

బాలుడి వైద్యానికి సాయం



వాడపాలెంలో బాలుడి తండ్రికి సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న బాలుడి వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.10 లక్షల సాయం మంజూరైనట్టు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రావులపాలెం మండలం వెదిరేశ్వరం గ్రామానికి చెందిన ఇళ్ల వెంకటేశ్వరరావు, నాగలక్ష్మి దంపతుల 5 నెలల కుమారుడు అఖిల్ లివర్ సంబంధిత వ్యాధికి గురయ్యాడు. అతి ఖరీదైన వైద్యం కావడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే బండారు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కృషి మేరకు బాలుడి వైద్యానికి సీఎంఆర్ఎఫ్ నుంచి తక్షణ సాయంగా రూ.10 లక్షలు మంజూరు కాగా ఆ పత్రాన్ని ఎమ్మెల్యే బండారు వాడపాలెంలోని తన స్వగృహం వద్ద బాలుడి తండ్రికి అందజేశారు.

ఈ-క్రాప్ నమోదు ప్రారంభం



పుల్లేటికుర్రులో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రామ్మోహనరావు

అంబాజీపేట: ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాగు చేసిన పంటలను ఈ-క్రాప్ నమోదు చేస్తున్నట్లు పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామమోహనరావు తెలిపారు. పుల్లేటికుర్రులో జరుగుతున్న ఈ-క్రాప్ పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్‌తో కలసి ఏడీఏ మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం వల్ల ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారాలు అందుతాయని రైతులకు వివరించారు. రైతుల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే అవకాశం ఉందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకునే వారు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, వ్యక్తిగత బ్యాంక్ ఖాతా నంబర్, ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి ఇవ్వాలన్నారు. సెప్టెంబర్ 15 నాటికి పంట నమోదు పూర్తి చేయాలని వీఏఏ, వీహెచ్ఏలకు సూచించారు. సామాజిక తనిఖీ నిమిత్తం సెప్టెంబర్ 19 నుంచి 24 వరకు రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు జాబితా ప్రదర్శనకు ఉంచి, గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అనంతరం అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. వీఏఏ జాబేజ్‌శాస్త్రి, రైతులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



మామిడికుదురు మండల నూతన కార్యవర్గం

మామిడికుదురు: ఫొటోగ్రఫీనే జీవనాధారంగా బతుకుతున్న తమకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించి ఆదుకోవాలని మామిడికుదురులో మంగళవారం జరిగిన మండల ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం కోరింది. అంబేడ్కర్ సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యలపై చర్చించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల పరిస్థితి దారుణంగా తయారైందని సమావేశంలో పలువురు వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు అండగా నిలిచి తమను ఆదుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సమావేశంలో ఘనంగా సన్మానించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రాక్షుల వీరకోటేశ్వరరావు, కార్యదర్శిగా మీర్ జవాద్ అలి, కోశాధికారిగా పడాల సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కాండ్రేగుల సత్యశ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా తోలేటి ఆదినారాయణమూర్తి, అప్పన కృష్ణమూర్తి, లోకం పుల్లారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పోరాటయోధుడు జక్కంపూడి



మామిడికుదురులో జక్కంపూడికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి



తాటిపాకలో జక్కంపూడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మామిడికుదురు: దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు పోరాట యోధుడని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి శ్లాఘించారు. జక్కంపూడి జయంతిని పురస్కరించుకుని మంగళవారం మామిడికుదురు సెంటర్‌లో రామ్మోహనరావు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి సేవలను కొనియాడారు. ప్రజా ప్రతినిధిగా, కార్మిక నాయకుడిగా, మంత్రిగా జక్కంపూడి ఎన్నో సేవలందించి పలువురికి ఆదర్శంగా నిలిచారని కీర్తించారు. జక్కంపూడి మామిడికుదురు మండలంలోని ఆదుర్రు గ్రామ వాసి కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కొమ్ముల రాము, మిండగుదుటి శిరీష్, తోరం గౌతమ్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, నయినాల శివ, అల్లు బుజ్జి, వర్ధినేని రాము, తేతల మోహనరెడ్డి, చిక్కం బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు అందించిన సేవలు చిరస్మరణీయమని కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ అన్నారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద మంగళవారం జక్కంపూడి జయంతిని సాయిరామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జక్కంపూడి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు దాసరి కాశీ, కొక్కిరి రవికుమార్, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, కోట విజయభాస్కర్, నాగాబత్తుల యువరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు జక్కంపూడి తాతాజీ అన్నారు. మంగళవారం తాటిపాకలో జక్కంపూడి జయంతి పురస్కరించుకుని రామ్మోహనరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మంత్రిగా ఉన్న సమయంలో రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. నాయకులు పోతు కాశీ, కటికిరెడ్డి బుజ్జి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రలో భాగమే ఎస్సీ వర్గీకరణ



రాజోలులో మాల మృతవీరుల సంస్మరణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజోలు: రాజకీయ కుట్రలో భాగంగానే ఎస్సీ వర్గీకరణ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు జగడం సత్యనారాయణ ఆధ్వర్యంలో మాల మృతవీరుల సంస్మరణ కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో సుప్రీంకోర్టు తీర్పు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆర్టికల్ 341 ప్రకారం ఎస్సీ సామాజికవర్గంలో ఏ కులాన్ని చేర్చాలన్నా, తొలగించాలన్నా పార్లమెంట్‌లో మూడింట రెండు వంతుల సభ్యుల మెజార్టీలో ఆమోదించాలన్నారు. ప్రధాని మోదీ అత్యంత ప్రధానమైన వ్యవస్థలను ప్రభావితం చేయడంలో పేరుగాంచారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పునకు నిరసనగా ఈ నెల 11వ తేదీన అమలాపురం గడియార స్తంభం సెంటరులో జరిగే భారీ నిరసన సభ కోనసీమ నలుమూలల నుంచి మాల సోదరులు తరలిరావాలని పిలుపునిచ్చారు. నాయకులు పెయ్యల పరశురాముడు, విప్పర్తి సాయిబాబు, మెడబల రాజ్‌కుమార్, గొల్ల ఉదయభాస్కర్, దీపాటి సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరగా ఇంటిపన్ను వసూలు చేయాలి

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి పంచాయతీ కార్యాలయంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ గరిమెళ్ళ రవి మంగళవారం తనిఖీ చేశారు. ఇంటి పన్ను వసూళ్లపై సిబ్బందిని ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది అందరూ కూడా ఆగస్టు 20వ తేదీ లోగా ఇంటి పన్ను బకాయిలు వసూలు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామంలోని పారిశుద్ధ్య పనుల పైన, దోమల నివారణ మందుల పిచికారీ, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ వంటి అంశాలపై చర్చించారు.

లంక గ్రామాల్లో దాణా పంపిణీ

మామిడికుదురు: గోదావరి వరద ప్రభావిత గ్రామాల్లో పశువులకు 15 టన్నులు దాణా పంపిణీ చేశామని మండల పశు వైద్యాధికారి చేగొండి శ్రీరామ్ మంగళవారం తెలిపారు. అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలకు చెందిన రైతులకు ఈ దాణాను అందించామన్నారు. గోదావరి వరదల ప్రభావంతో పశుగ్రాసం పాడైపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఉచితంగా పశువుల దాణాను రైతులకు అందజేసిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గబ్బల దుర్గ, సుందరనీడి రాజేష్‌కుమార్, గెద్దం మంగాలక్ష్మి, చెల్లుబోయిన రామశివసుబ్రహ్మణ్యం, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శిశుమందిరం పాఠశాలకు సీఎస్ఆర్ గ్రాంటు



బెంగళూరులో కెనరా బ్యాంకు ఎండీ సత్యనారాయణరాజు చేతుల మీదుగా నిధుల మంజూరు లెటర్ అందుకుంటున్న రుద్రరాజు

మలికిపురం: మండలంలోని లక్కవరంలో దాతల సహకారంతో మంగెన వారి కుటుంబం నిర్వహిస్తున్న సరస్వతి శిశుమందిరం ఉన్నత పాఠశాలకు, బెంగళూరు కేంద్రంగా ఉన్న కెనరా బ్యాంకు ఎండీ, సీఈవో కలిదిండి సత్యనారాయణరాజు సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా రూ.12 లక్షలు మంజూరు చేశారు. లక్కవరంలో సదరు బ్యాంకు బ్రాంచి ఫౌండర్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు కృషితో పై మొత్తం మంజూరైంది. బెంగళూరులో ఎండీ సత్యనారాయణరాజును కలిసి, పేద విద్యార్థులు చదువుతున్న శిశుమందిరం స్కూల్‌కు సహకారం అందించాలని రుద్రరాజు కోరారు. ఈ మేరకు సీఎస్ఆర్ గ్రాంటు ద్వారా పై మొత్తాన్ని ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజు మంజూరు చేస్తూ లెటర్ ఇచ్చినట్టు రుద్రరాజు మంగళవారం మీడియాకు తెలిపారు.

పిల్లలకు స్నాక్స్ పంపిణీ

మామిడికుదురు: అమలాపురం హరి మనో వికాస కేంద్రం పిల్లలకు మంగళవారం పెదపట్నంలంక గ్రామ సర్పంచ్ సుందరనీడి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో స్నాక్స్, శానిటైజర్లు అందించారు. మనో వికాస కేంద్రంలో జీవనం సాగిస్తున్న వారికి దాతలు సహకారం అందించాలని రాజేష్‌కుమార్ ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో యేడిద రఘు, సుందరనీడి సూరిబాబు, స్థానికులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు పరిశీలన

మలికిపురం: మండలంలోని బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పరిశీలించారు. మెనూ ప్రకారం వంటలు రుచికరంగా ఉండడంతో ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో కలసి కూర్చొని భోజనం చేశారు. అనంతరం పాఠశాలలో యాజమాన్య కమిటీల నియామకాల కోసం ఎన్నికల నోటిఫికేషన్, పాఠశాల నోటీసు బోర్డుపై ఎన్నికల షెడ్యూల్‌ను డీఈవో పరిశీలించారు. సమగ్ర శిక్షా పీడీ ఎం.మధుసూదనరావు, సీఎంవో బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు ఎం.విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ, పాఠశాల హెచ్ఎం హనుమంతురావు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

అంబాజీపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ మండల సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవర్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

ఆలమూరు ఎస్సైగా అశోక్



ఆలమూరు: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సైగా ఎం.అశోక్ నియమితులయ్యారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని కొత్తపేట ఎస్సైగా పని చేసిన ఎస్సై అశోక్ బదిలీపై ఆలమూరు వచ్చారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకూ ఎస్సైగా పనిచేసిన ఎల్.శ్రీనునాయక్ అనపర్తికి బదిలీ అయ్యారు.

గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం: స్థానిక కొత్త అక్విడెక్టుపై నుంచి గత శనివారం వైనతేయ నదిలో పడి గల్లంతైన వృద్ధుడి మృతదేహం మంగళవారం ఓడలరేవు వద్ద లభ్యమైంది. మృతుడిని అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన మేకా ఆదినారాయణ (75)గా గుర్తించారు. ఆదినారాయణ ప్రమాదవశాత్తూ నదిలో పడి గల్లంతయ్యాడని అతడి బంధువులు ఇటీవల పి.గన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఏఎస్సై ఎస్.పట్టాభిరామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయానికి మొక్కల విరాళం

ఆత్రేయపురం: భక్తుల కోరికలు తీర్చే ఏడువారాల వెంకన్నగా ప్రఖ్యాతి గాంచిన వాడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయానికి రూ.50 వేలు విలువ చేసే ఫల, పుష్ప, అలంకార మొక్కలను విరాళంగా పంపించారు. కడియంకి చెందిన యువ నర్సరీ రైతు వెన్నపు మణికంఠ స్వామి మంగళవారం దేవదాయశాఖకు ఈ మొక్కలను అందజేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తన వంతుగా కొన్ని పుణ్యక్షేత్రాలకు, ప్రభుత్వం పాఠశాలలకు మొక్కలు ఉచితంగా అందజేసేందుకు నిర్ణయించుకున్నామన్నారు. అందులో భాగంగానే దేవదాయశాఖ సూచనల మేరకు ఆలయానికి అవసరమైన మొక్కలను అందజేశామన్నారు.

గోదావరి నదీ కోత పరిశీలన

సఖినేటిపల్లి: మండలంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పర్యటించారు. సఖినేటిపల్లిలంక, అంతర్వేది పల్లిపాలెం గ్రామాల్లో నదీకోతలను పరిశీలించారు. అలాగే సఖినేటిపల్లి లాకులు, అంతర్వేది వద్ద రాళ్ల మురుగుకాలువ అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ను కూడా ఆయన పరిశీలించారు. ఈ మేరకు ఇందుకు సంబంధించి ఉన్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వరద ముంపు ప్రాంతం పరిశీలన

మలికిపురం: మండలంలోని దిండి ఏటిగట్టు వద్ద నిలిచిన వరద ముంపు ఏరియాను రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం పరిశీలించారు. వెంట పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన

మామిడికుదురు: ఈ నెల 8వ తేదీన జరిగే స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను విద్యాశాఖ ఏపీసీ మధుసూదనరావు, సీఎం బీవీవీ సుబ్రహ్మణ్యం మంగళవారం పరిశీలించారు. మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఓటర్ల జాబితాను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం ఉందన్నారు. వివాదాలకు అతీతంగా ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

9న కొత్తపేట శతాబ్ది కళాశాలలో మెగా జాబ్‌మేళా

కొత్తపేట: స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోసరీ సాఫ్టెక్ సంస్థ ద్వారా పలు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆ కంపెనీల్లో టెక్ మహీంద్ర, సింధు బ్యాంక్, మెడ్‌ప్లస్, అపోలో, శ్రీకృష్ణ ఫార్మా, కార్బోన్, పుణ్యాలన, ఇసుజు, రాక్‌మెన్ తదితర కంపెనీలు పాల్గొనగా ఆయా సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్ విద్యార్హత గల అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. సిద్దార్థ, శతాబ్ది కళాశాలల విద్యార్థులతో పాటు ఇతర కళాశాలల అభ్యర్థులు కూడా ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు.

అందరికీ రేషన్ అందాలి

అంబాజీపేట: ప్రతి నెలా పంపిణీ చేసే రేషన్‌ను కార్డుదారులందరికీ అందజేయాలని ఎండీయూ వాహనదారులకు మండల రెవెన్యూ అధికారి ఎండీ ఇబ్రహీం సూచించారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, మాచవరం గ్రామాల్లో ఎండీయూ వాహనాల ద్వారా అందిస్తున్న రేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. సాంకేతిక కారణాల వల్ల సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కార్డుదారులందరికి రేషన్ పూర్తి స్థాయిలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

దోమల నిర్మూలనకు సహకరించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో దోమలు అధికంగా పెరిగిపోయాయని వాటి నిర్మూలనకు అందరూ సహకరించాలని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, పంచాయతీ కార్యదర్శి జీవీవీకే కుమార్‌లు పిలుపునిచ్చారు. మాచవరంలో దోమల నివారణకు ఎబేట్ మందును స్ప్రే, బ్లీచింగ్‌ను మంగళవారం చల్లించారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను సర్పంచ్, కార్యదర్శి పరిశీలించారు. వారు మాట్లాడుతూ పరిసరాలు, ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూడాలని తద్వారా దోమలను అరికట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వి.మురళీకృష్ణ, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

మానసిక రోగులతో స్నేహంగా మెలగాలి

అంబాజీపేట: పని ఒత్తిడి వల్లో, చిన్నతనం నుంచి మానసిక రోగానికి గురైన వారితో స్నేహపూర్వకంగా మెలిగితే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని అమలాపురం ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు సౌమ్య అన్నారు. ముక్కామలలో జాతీయ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశాలతో సమావేశం నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు గంటలోపు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంజీవనిలా పని చేస్తుందని బాలింతలకు, గర్భిణులకు వివరించాలని వైద్యాధికారి ఎ.ఇంద్రావతి అన్నారు.

ఆధ్యాత్మిక మార్గాన్ని అలవరచుకోవాలి

అంబాజీపేట: మహిళలు తమ సౌభాగ్యాన్ని పెంపొందించుకొనేందుకు ఆధ్యాత్మిక మార్గాన్ని అలవరచుకొని సన్మార్గంలో నడుచుకోవాలని అంబాజీపేటలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న నంబూరుకు చెందిన శ్రీ కాళవనాశ్రమ పీఠాధిపతులు యోగిని శ్రీ చంద్రకాళీప్రసాద్ మాతాజీ సత్సంగ సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. మాతాజీ మాట్లాడుతూ కలియుగంలో ముక్తి పొందేందుకు భగవధ్యానానికి మించిన మార్గం లేదన్నారు. ప్రతి ఒక్కరూ హిందూ సంప్రదాయాలను పాటిస్తూ వాటి విలువలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శ్రావణ మాసం మంగళవారాన్ని పురస్కరించుకుని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీబాబూ భక్త సమాజ్, ఆలయ నిర్వాహకులు ఆధ్వర్యంలో మాతాజీ పర్యవేక్షణలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. సుమారు 250 మహిళలు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీ సద్గురుదేవుల పాద పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

నరసన్న సన్నిధిలో తెలంగాణ ఈసీ

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం వేద ఆశీర్వచనాలు అందించారు. ఆయనకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ అందజేశారు.

కిడ్నీ బాధితుడికి రూ.43 వేల సాయం

పి.గన్నవరం: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఎల్.గన్నవరానికి చెందిన కొల్లు రవీంద్రకు మంగళవారం అదే గ్రామం లాకు ప్రాంతానికి చెందిన కాపు యువత, పవన్ సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం రూ.43 వేల సాయాన్ని అందించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.